క్లుప్తంగా

హామీని అమలుచేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపడుతామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని అంబేడ్కర్ సంఘాల జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేయడంలో జాప్యంపై మాదిగలకు వివరణ ఇవ్వాలన్నారు.ఎస్సీ వర్గీకరణకు కొందరు అడ్డుపడటం సరికాదన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ సంఘాల నాయకులు రుద్రారం రామచంద్రం, ఆవునూరి ప్రభాకర్, ఖానాపురం లక్ష్మణ్, మంగలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్' సినిమా ప్రారంభం



సిరిసిల్లటౌన్: కేశవ చంద్ర రమావత్ సినిమాను మంగళవారం సిరిసిల్ల విమల్ థియేటర్‌లో చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్నివర్గాల వారిని ఆకట్టుకునేలా సినిమాను తెరకెక్కించిన చిత్ర యూనిట్‌ను ఆమె అభినందించారు. థియేటర్ ముందు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, థియేటర్ మేనేజర్ రవి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు వేలం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2025 నుంచి 2027 (రెండేళ్లు) వరకు వివిధ లైసెన్స్ అంశాలకు సంబంధించి మంగళవారం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమిదలు చమురుతో ఉన్న వత్తుల విక్రయానికి బిక్షపతి అనే వ్యక్తి రూ.50,55,555లకు టెండర్ దక్కించుకున్నాడు. కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముటకు విక్రమ్ అనే వ్యక్తి రూ.55,55,999లకు టెండర్ దక్కించుకున్నాడు. పప్పు బెల్లం, ఆటవస్తువులు అమ్ముకొనేందుకు పర్శరాములు రూ.10,06,666, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొను విక్రమ్ రూ.21,55,999లకు టెండర్ దక్కించుకున్నారు. నాగపణి వద్ద ఇన్‌స్టాంట్ ఫొటోల లీజు హక్కును రూ.24,06,666లకు పర్శరాములు దక్కించుకున్నట్లు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. అలాగే క్యాంటీన్ నిర్వహణ లీజు హక్కునకు ఎవరు డిపాజిట్లు చెల్లించనందున వాయిదా వేశారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

వేములవాడఅర్బన్: విద్యార్థులు బాగా చదవి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఎన్‌వైకేఎస్ మాజీ వలంటీర్ గంగిపల్లి స్వామికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రాముఖ్యతలను తెలుసుకుని, బాధ్యత కలిగిన పౌరులుగా అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, రాంబాబు, రాజశేఖర్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి అఫ్జల్ బేగం అన్నారు. మండలంలోని కోరుట్లపేటలో ఉపాధి పథకంలో భాగంగా పశువుల పాక నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి పనులతో ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి పథకంలో అనుమతించిన అన్ని పనులను ఆయా శాఖల అధికారులు ప్రారంభించారు. ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో కొమురయ్య, టీఏ రాజు, పీఎస్ సుస్మిత, ఎఫ్ఏ లక్ష్మి, పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

తంగళ్లపల్లి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల పరిధిలో చేపట్టే ఉపాధిహామీ పనులను మంగళవారం డీఆర్డీవో, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన రైతు తుమ్మ దేవవరంకు రూ.80 వేలతో మంజూరైన పశువుల పాక నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీలో ఉత్తమ మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేసిన ఆంజనేయులు, విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను సన్మానించారు. ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఏడీఆర్డీవో కోర నర్సింహులు, ఎంపీవో మీర్జా బేగ్, ఇన్‌చార్జి ఏపీవో రాజనర్సు, పంచాయతీ కార్యదర్శి రఘు వీరారెడ్డి, టీఏలు పాల్గొన్నారు.



వేములవాడ : బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రతాప రామకృష్ణ, నాయకులు



ఎల్లారెడ్డిపేట : జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

వేములవాడ/ వేములవాడ అర్బన్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/గంభీరావుపేట : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సిరిసిల్ల వేములవాడలో నియోజకవర్గాల్లో అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, కళాశాలలు, పాఠశాలలు, పోలీస్‌స్టేషన్లలో వేడుకలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ విశిష్టతపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై, కానిస్టేబుళ్లు

కదం తొక్కిన కార్మికలోకం

సిరిసిల్లటౌన్: శ్రామికలోకం కదం తొక్కింది. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై అన్ని ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు రోడ్డెక్కారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, తదితర ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా, కలెక్టరేట్ వద్ద వేర్వేరుగా జరిగిన ధర్నాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఏఐఎఫ్‌టీయూ న్యూ, అధ్యక్షుడు సోమిశెట్టి దశరథం పాల్గొని మాట్లాడారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించిన కేంద్రం వారిని బానిసత్వంలోని నెట్టేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక, కర్షకులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు.



అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత్ అశోక్, ఐఎఫ్టీయూ నాయకులు పరుశరాములు, మల్లయ్య, సైజింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిషోర్, రాము, నాయకులు ఎ.గణేశ్, రాజశేఖర్, కె.రాములు, కేవీ అనసూయ, జి.పోచయ్య, జి.మల్లయ్య, ఎస్.నర్సయ్య, పి.చంద్రయ్య, మారుతి, దశరథం, దేవదాసు, రాజేశం, సత్తయ్య పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



సిరిసిల్ల: పట్టణంలోని బీవైనగర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త బింగి ఇజ్జగిరి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మంగళవారం ఆశీర్వదించారు. ఇజ్జగిరి కుమారుడి పెళ్లి ఇటీవల జరిగింది. పట్టణానికి వచ్చిన సందర్భంగా కేటీఆర్ వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

తంగళ్లపల్లి:: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో బాలికా సంరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం జిల్లా కోఆర్డినేటర్ ఏఎస్సై ప్రమీల మట్లాడుతూ బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గంజాయి, గుట్కా, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.25 వేలు జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండి ఉపేందర్, ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, తిరుపతి, వై.శ్రీనివాస్, కళాప్రపూర్ణ, శ్రీకాంత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం అధికారులు

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: క్రిస్మస్ సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో సేవలందించిన మైనార్టీ వ్యక్తులు, సంస్థలను గుర్తించి సత్కరించేందుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. సమాజ సేవ, వైద్య, విద్య, సాహిత్యం, లలిత కళలు, థియేటర్, క్రీడారంగాల్లో పదేళ్ల కనీస అనుభవం గల మైనారిటీ వ్యక్తులు, 30 ఏళ్లుగా సేవలందిస్తున్న క్రిస్టియన్‌సంస్థల నుంచి నామినేషన్లు డిసెంబర్ 5లోపు అందించాలన్నారు. నిర్ణీత నమూనాలో తయారు చేసిన ప్రతిపాదనలను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99499 10328 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలో పది జోడీల యజమానుల ఉనికిని బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకు కుటీర పవర్లూమ్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేశారు. మంగళవారం సిరిసిల్లలో ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో కుటీర వస్త్ర ఉత్పత్తిదారులకు ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక విధివిధానాలు తయారుచేయాలని కోరారు. గతంలో టెక్స్‌టైల్ పార్కులు అర్వీఎం ఆర్డర్‌కు ఇచ్చిన విధంగా నేరుగా భీములు, కోములు ఇవ్వాలన్నారు. సంఘం ప్రతినిధులు గౌడ వాసు, ప్రతాప్, రమేశ్ పాల్గొన్నారు.

ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ వాదనలు తిరస్కరణ

వేములవాడఅర్బన్: దేశ ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టి వేసిందని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ వాదనలను కోర్టు తిరస్కరించిందన్నారు.

మహిళలను వేధిస్తే 'క్షమించవద్దు'



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ రోజా

సిరిసిల్ల: మహిళలను వేధిస్తే క్షమించవద్దని, చట్టం పరిధిలో వారిని శిక్షించేలా ప్రతీ మహిళ చేతులు కలపాలని మహిళా సాధికార కేంద్రం కో ఆర్డినేటర్ రోజా అన్నారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల్లో (నవంబర్ 25 నుండి డిసెంబర్ 10) భాగంగా మంగళవారం జిల్లా సమాఖ్యలో అవగాహన శిబిరం నిర్వహించారు. మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకుని 25 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ హింసలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అందుకే ఈ సంవత్సరం థీమ్‌గా 'క్షమించద్దు' అనే నినాదంతో మహిళల పట్ల హింసను నిర్మూలించేందుకు చేతులు కలుపుదామన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ పద్మయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, సఖీ కేంద్రం కౌన్సిలర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: అర్హులై ఉండి గతంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల డ్రాలో పేర్లు రాని పేదలు 850 మందికి ఇందిరమ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులకు డబుల్‌బెడ్ రూంలు అందిస్తామని చెప్పి డ్రా పెట్టి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన 850 మందిని మొదటి ప్రాధాన్యత గుర్తించాలని కోరారు. అనంతరం కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎగువమానేరులో యువకుడి గల్లంతు

గంభీరావుపేట: నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులో యువకుడు గల్లంతయ్యాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలానికి చెందిన ఓ యువకుడు సెల్ ఫోన్‌లో కుటుంబసభ్యులు, బంధువులతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సమాచారం. యువకుడికోసం మానేరులో గంభీరావుపేట పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

● డాటా ఎంట్రీ విధులు కేటాయించొద్దు

సిరిసిల్లటౌన్: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సామాజిక ఆర్థిక కుల గణన విధులు కేటాయించొద్దని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు డాటా ఎంట్రీ డ్యూటీల మూలంగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంలో వెనుకబడే అవకాశాలున్నాయన్నారు. జిల్లాప్రధానకార్యదర్శి అంజనేయులు ఉన్నారు.

● బ్యాంకు మేనేజర్ పై ఫిర్యాదు

ముస్తాబాద్: తనను బ్యాంకు మేనేజర్ దూషించాడని మండలకేంద్రానికి చెందిన మిడిదొడ్డి లక్ష్మి ఎస్సై గణేశ్‌కు మంగళవారం ఫిర్యాదు చేసింది. రెండ్రోజుల క్రితం ఓ బ్యాంకుకు పొదుపు డబ్బులు చెల్లించేందుకు వెళ్లినట్లు లక్ష్మీ తెలిపింది. పొదుపు సంఘం బకాయి చెల్లించాలంటూ మేనేజర్ తనను అసభ్య పదజాలంతో దూషించినట్లు పేర్కొంది. లక్ష్మి ఫిర్యాదుమేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేములవాడరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసు వివరాల ప్రకారం చెక్కపల్లికి చెందిన బలవేని శ్రీనివాస్ (45) బైక్‌పై రోడ్డు దాటుతుండగా వేములవాడకు చెందిన టీఎస్ 07 హెచ్ ఎల్ 8228 నంబర్ గల కారు నూకలమర్రి నుంచి వస్తూ చెక్కపల్లి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్ 20 రోజులుగా ఇంటివద్ద చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన బాలిక..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవుని గుట్ట తండా పంచాయతీ పరిధి చింతకుంట తండాకు చెందిన మాలోతు మంజుల- తిరుపతి దంపతుల కూతురు రక్షిత (17) దుమాల గురుకులం ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ వరకు చదివింది. ఇంటర్‌లో ఫెయిల్ అయి ఇంటి వద్దే ఉంటుంది. వారం రోజుల క్రితం పురుగుమందు తాగింది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

●తూకంలో తేడావచ్చిందని ట్రక్‌షీట్ ఇవ్వని మిల్లర్

ఎల్లారెడ్డిపేట : ధాన్యం తూకంలో తేడా వచ్చిందని రైస్ మిల్ యజమాని ట్రక్ షీట్ ఇవ్వడం లేదని మండలంలోని వెంకటాపూర్ రైతులు ఆరోపించారు. 824 సన్నరకం వడ్ల బస్తాల లారీలో ఆరు వడ్ల సంచులు తేడా వచ్చిందని రైస్‌మిల్ యజమాని అంటున్నట్లు రైతులు తెలిపారు. 12 రోజుల క్రితం లోడ్ చేసుకొని ఇప్పుడు తూకంలో తేడా అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోయారు.

● అదృశ్యమైన మహిళ ఆచూకీ గుర్తింపు

తంగళ్లపల్లి: అంకుషాపూర్‌కరు చెందిన ఆసం రేణుక (50) సోమవారం గ్రామంలో అదృశ్యమైంది. ఆచూకీ కోసం వాట్సాప్ గ్రూపుల్లో ఆమె వివరాలను పోస్ట్‌చేశారు. మంగళవారం వేములవాడలో రేణుక ఆచూకీని గుర్తించారు. కుటుంబ సభ్యులకు ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. అదృశ్యంపై ఎస్సై రామ్మోహన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

● పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గంభీరావుపేట: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండల మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్, మండల పరిషత్, మండల వనరుల కేంద్రాల ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 10, 11వ తేదీల్లో టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

● పాఠశాల తనిఖీ

బోయినపల్లి: వరదవెల్లి హైస్కూల్‌ను మంగళవారం ఎంఈవో శ్రవణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. పదో తరగతి స్టడీ అవర్స్‌పై ఆరాతీశారు.

● పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

తంగళ్లపల్లి: మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కాయితోజు సంతోష్‌కుమార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేయడం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 22న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ నర్సింహులపల్లె గ్రామంలో పర్యటించగా.. పంచాయతీ కార్యదర్శి అనాధికారికంగా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఈ నెల 23న కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

● అధికారులపై చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్, కోళ్లమద్ది మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సందర్భంగా జిల్లా సర్పంచుల సంఘం నాయకులు మంగళవారం ఆయనకు మనోధైర్యం కల్పించారు. కేశవరావును పరామర్శించి బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఖజానాలో నిధులు ఉన్నప్పటికీ బిల్లులు చెల్లించని గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఈవోలపై చర్యలు తీసుకోవాలని, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.



చందుర్తి: మండలకేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను నరికివేసి రోడ్డు పక్కనే వదిలేశారు. దీంతో రాత్రిపూట ఎదురుగా వచ్చే వాహనాల లైట్లతో ద్విచక్రవాహనాదారులకు రోడ్డు సరిగా కనిపించక చెట్ల కొమ్మలపై పడిపోతూ గాయాలపాలతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, చందుర్తి సెల్ నం: 9676989692

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు



బోయినపల్లి : ఫౌల్ట్రీషెడ్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం



గంభీరావుపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బోయినపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని రామన్నపేటలో ఈజీఎస్ నిధులు రూ.3 లక్షల అంచనాలతో నిర్మించే ఫౌల్ట్రీషెడ్ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమ జయశీల, తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, జిల్లా ప్రధానకార్యదర్శి జంగం అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

బోయినపల్లి చెరువు వద్ద ఎంపీడీవో భీమ జయశీల ఆధ్వర్యంలో మొక్కలునాటారు. ఈజీఎస్ ఏపీఓ సబిత, పంచాయతీకార్యదర్శులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను మండలంలో నిర్వహించారు. సముద్రలింగాపూర్, గంభీరావుపేట, దమ్మన్నపేట, నర్మాలలో ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న పశువులపాక నిర్మాణాలకు అధికారులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో రాజేశ్వర్, పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు రంగంపేటలో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ ఏపీవో శ్రీహరి మాట్లాడుతూ.. మండలకేంద్రంలో పశువులపాక, రంగంపేటలో ఫౌల్ట్రీ షెడ్‌కోసం శంకుస్థాపన, గ్రామాల్లో నర్సరీ పనులు ప్రారంభించారు. మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు, వైచైర్మన్ లెంకల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, కుమర్, పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: అనంతారంలో ఉపాధిహామీ పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రజాపాలనలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా చేపట్టిన మన ఊరిలో పనుల జాతర పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, పాల్గొన్నారు

ఇల్లంతకుంట: అనంతారంలో ఉపాధి హామీ పనులను ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్ ప్రారంభించారు. ఎంపీడీవో శశికళ, ఏపీవో చంద్రయ్య, కార్యదర్శి విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొవాలి

చందుర్తి: విద్యార్థులు ఆత్మన్యూనతను వదిలి పెట్టాలని జిల్లా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆత్మన్యూనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొవాలంటే ధైర్యంగా ఉండాలన్నారు. మానసిక సమస్యలు ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్

ఓటరు జాబితాపై సమావేశం

ముస్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులపై మండల పరిషత్‌లో అఖిలపక్షం నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలపై చర్చించారు. ఇటీవల కొత్తగా చేరిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. సవరణలు, మార్పులు, చేర్పులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఎస్‌ఎఫ్ఐ బాధ్యుడు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

నురుగు.. మురుగు.. దుర్వాసన

వేములవాడ: రాజన్న ఆలయం ప్రధాన ద్వారం సమీపంలోనే పైప్ ద్వారా నురుగు నీరు, మురుగుగా మారి దుర్వాసన వెదజల్లడంతో భక్తులు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వచ్చింది. మురుగునీరు నేరుగా డ్రైనేజీలోకి పంపింగ్ చేసేలా ఆలయ అధికారులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



● కుక్కకాటుతో ఒకరికి గాయాలు

కోనరావుపేట: మరిమడ్లలో కుక్క కాటుతో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తొట్ల పర్శరాములు పొలం వద్ద పనులు చేస్తుంగా కుక్కదాడి చేసి గాయపరిచింది. వెంటనే మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.